ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 04-07-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మైనింగ్ రంగాన్ని మెరుగుపరచడానికి వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సూచించారు.

2. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 42కి చేరుకుంది.

3. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. హైదరాబాద్ లక్డీకపూల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి ఆవిష్కరించారు.

4. రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

కిషన్ రెడ్డి-మైనింగ్

దేశీయ బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని , ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు ఇది ప్రధాన ప్రాధాన్యత అని ఆ శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్, మాదాపూర్ లో ఉత్తమ గని మూసివేత పద్ధతుల ద్వారా సుస్థిర , బాధ్యతాయుత మైనింగ్‌పై అంతర్జాతీయ సదస్సును ఈరోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిర్దిష్ట ప్రయత్నాల ఫలితంగా దేశ చరిత్రలో తొలిసారిగా ఒక బిలియన్ టన్నులకు పైగా బొగ్గును ఉత్పత్తి చేసి చారిత్రక మైలురాయిని అధిగమించిందని తెలిపారు. బొగ్గు, ఖనిజాలలో స్వయం సమృద్ధి , పర్యావరణ సుస్థిరత లక్ష్యాల ప్రాముఖ్యతను

నొక్కి చెబుతూ మైనింగ్ రంగాన్ని మెరుగుపరచడానికి వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని ప్రతినిధులను కోరారు. ప్రకృతిని , ప్రజలను సంరక్షిస్తేనే మైనింగ్ నిజంగా సుస్థిరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పటిష్టమైన విధానం , పాలనా వ్యవస్థ మద్దతుతోనే సుస్థిర మైనింగ్ సాధ్యమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

సౌండ్ బైట్ ... కిషన్ రెడ్డి

(ఎంఎస్ఎమ్)

సిగాచీ – మృతులు

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 42కి చేరింది. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహారాష్ట్రకు చెందిన భీమ్ రావు ఈ ఉదయం మృతి చెందినట్టు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 143 మంది కార్మికులు పనిచేస్తుండగా ఇప్పటివరకు 61 మంది సురక్షితంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 23 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, కోలుకున్న 12 మందిని డిశ్చార్జ్ చేశారు. మృతి చెందిన వారిలో 31 మంది కార్మికుల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది , మరో 7 మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి ఉంది. గుర్తించిన 31 మంది కార్మికుల కుటుంబాలకు లక్ష రూపాయల తక్షణ ఆర్థిక సహాయం అందించారు. అలాగే, 34 మంది క్షతగాత్రులకు 50 వేల రూపాయలు , ఆచూకీ తెలియని 9 మంది కార్మికుల కుటుంబాలకు 10 వేల రూపాయల తాత్కాలిక సహాయం అందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. రక్త నమూనాల సరిపోలిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.
మరోవైపు సిగాచి పరిశ్రమ ప్రమాదంలో గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యున్నత కమిటీ విచారణ చేపట్టింది.
రామకృష్ణారావు చైర్మన్ గా ఉన్న ఈ కమిటీ ఉదయం సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకుంది.
(పీటీసీ, సంగారెడ్డి)

రోశయ్య జయంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కొణిజెటి రోశయ్య జయంతిని ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. హైదరాబాద్ లక్డీకాపూల్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి ఈ ఉదయం ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి క్రుష్ణారావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

(డెస్క్)

రోశయ్య, కొమురయ్య-నివాళులు

హైదరాబాద్ తో పాటు జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులు , అధికారులు రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురి చిత్రపటానికి నివాళులు అర్పించారు. మహనీయుల సేవలు చిరస్మరణీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. జిల్లా కలెక్టరేట్‌లో కొణిజేటి రోశయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమామంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

మెదక్ కలెక్టరేట్ లో జిల్లాలో దొడ్డి కొమురయ్య వర్ధంతి , కొణిజెటి రోశయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , అదనపు కలెక్టర్ నగేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి, కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని , వారి ఆశయాలను నేటితరం అనుసరించాలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 16 సార్లు ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి ,

దివంగత కొణిజేటి రోశయ్య అని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు.
(డెస్క్/ పీటీసీ, మెదక్, పెద్దపల్లి, ఆసిఫాబాద్, సిరిసిల్ల)

కాంగ్రెస్ సభ-ఖర్గే
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సామాజిక న్యాయ సమరభేరి సభ జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు , క్రియాశీల కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. సభ నేపథ్యంలో ఎల్బీ స్టేడియం పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కాగా , తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఈ ఉదయం గాంధీ భవన్ లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ , పీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. బీసీ కుల ఘనన , ఎస్సీ వర్గీకరణతో పాటు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలు , జై సంవిధాన్ బచావో కార్యక్రమాలు , సంస్థాగతంగా పార్టీ నిర్మాణం , జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక , స్థానిక సంస్థలు ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పీఏసీ సభ్యులు పాల్గొన్నారు.
(డెస్క్)

కేసీఆర్
స్వల్ప అస్వస్థతతో నిన్న సాయంత్రం హైదరాబాద్ సోమాజిగూడ ఆసుపత్రిలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి

చేరింది. నీరసం , రక్తంలో షుగర్ అధికంగా , సోడియం తక్కువగా ఉండటంతో ఆసుపత్రిలో చేర్చినట్లు వైద్యులు తెలిపారు. చంద్రశేఖరావు ఆరోగ్య పరిస్థితి గురించి ఆస్పత్రి వైద్యులు , అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యుత్తమ చికిత్స అందించాలని ఆదేశించారు. చంద్రశేఖర్ రావు త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి తో పాటు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు.
(డెస్క్)

మహబూబాబాద్ రోడ్డు ప్రమాదం
మహబూబాబాద్ జిల్లాలో ఈ తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురు మ్రుతి చెందారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ శివారు ఎల్లంపేట స్టేజి సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లు, ఓ క్లీనర్ సజీవ దహనం అయ్యారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని అగ్ని మాపక సిబ్బందితో మంటలను ఆర్పివేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.
మహబూబాబాద్ జిల్లా, పిటిసి)

వాతావరణం
రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో రాబోయే 24 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆదిలాబాద్ , కొమరం భీమ్ ఆసిఫాబాద్ , మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి , వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.
(డెస్క్)

మావోయిస్టు-లెటర్

తెలంగాణలో ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని , రాష్ట్ర పర్యటనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ విషయంలో చొరవ చూపాలని నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిపేవారు మావోయిస్టులతో చర్చలు జరపమనే కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారం చేపట్టిన వెంటనే మావోయిస్టులతో చర్చలు జరుపుతామని గతంలో ఇచ్చిన హామీని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పుడు విస్మరించారని అన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని కోరారు.

(పీటీసీ, సిరిసిల్ల)

నాగార్జున సాగర్

నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 521 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 63 వేల 150 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. హైదరాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం కేవలం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే బయటకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా ఎగువ నుంచి దాదాపు 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

(పీటీసీ, నల్లగొండ జిల్లా)

వరంగల్-వర్షాలు ముందస్తు చర్యలు

వర్షాకాలం నేపథ్యంలో వరంగల్ జిల్లాలో విపత్తుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. ఇందులో భాగంగా 179 మంది ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. వరదలు రాకుండా నగరంలోని ప్రధాన నాలాలను శుభ్రం చేయడం, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను తొలగించడం , చెరువుల్లో పూడిక తీయడం వంటి

పనులు చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పీహెచ్‌సీలలో మందులు సిద్ధం చేసి , సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.
(పీటీసీ, వరంగల్)

భద్రచాలం-నీటిమట్టం

కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. నిన్న 12 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం ఇవాళ మరో 3 అడుగులు పెరిగింది. ప్రస్తుతం 15 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది.
(PTC- B.KGM)

హైకోర్టు న్యాయమూర్తిగా జనగామవాసి

తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు నలుగురు కొత్త న్యాయమూర్తులని సిఫార్సు చేసింది. ఇందులో జనగామ జిల్లా కేంద్రానికి చెందిన సుద్దాల చలపతిరావు పేరు ఉండడం పట్ల జనగామలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. 1971లో జనగామలో జన్మించిన చలపతి రావు 1998లో బార్ కౌన్సిల్లో చేరారు. ప్రస్తుతం జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం స్టాండింగ్ కౌన్సిల్ గా పని చేస్తున్నారు.
(పీటీసీ, జనగామ)